సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
ఆదివారం । 1 । అక్టోబర్ । 2023



వృద్ధాప్యంలోనూ సమాజ సేవ

వయోభారం ఇబ్బంది పెడుతున్నా కొందరు వృద్ధులు సమాజ హితం కోసం తమ వంతు కృషి చేస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు. 8లో



115 శాతం బొగ్గు ఉత్పత్తి

సెప్టెంబర్ నెలకు సంబంధించి సింగరేణి కొత్తగూడెం ఏరియాలో 10.83 లక్షల టన్నులతో 115 శాతం బొగ్గు ఉత్పత్తి అయింది. 8లో

వాతావరణం

గరిష్టం / కనిష్టం
31° / 25°

జిల్లాలో ఆదివారం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్ని ప్రాంతాల్లో చిరు జల్లులు పడే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

రామయ్యకు వైభవంగా సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

వైభవంగా శ్రీ బాలాజీ కల్యాణం



స్వామి వారి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

అన్నపురెడ్డిపల్లి : మండల కేంద్రంలో కొలువుదీరిన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీబాలాజీ వేంకటేశ్వర స్వామి వారి కల్యాణాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి ఉదయం పంచామృత అభిషేకం, అర్చన చేశారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యులు స్వామి వారి కల్యాణాన్ని వేదమంత్రాల నడుమ శాస్త్రోక్తంగా జరిపించారు. భక్తులు స్వామి వారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

నేటి నుంచి డీడీఎన్ అర్చకులకు శిక్షణ

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన ధూప, దీప, నివేదన ఆలయాల అర్చకులకు ఆదివారం నుంచి 3వ తేదీ వరకు పునశ్చరణ తరగతులు నిర్వహించనున్నారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి పుణ్యక్షేత్రంలో తరగతులు ఉంటాయని దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఉమ్మడి జిల్లా సహాయ కమిషనర్ ఎ.సులోచన ఒక ప్రకటనలో తెలిపారు. పాంచరాత్ర, వైదిక స్మార్త, వైఖానస, శైవ, వీరశైవ, గ్రామ దేవత ఆగమాల్లో నిష్ణాతులైన వారిచే అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు.

కిన్నెరసాని నుంచి నీరు విడుదల



దిగువకు విడుదలవుతున్న వరద నీరు

పాల్వంచరూరల్ : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో కిన్నెరసాని జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతోంది. 407 అడుగుల నీటి నిల్వ సామర్థ్యం గల ఈ రిజర్వాయర్‌లోకి ఎగువ నుంచి 1500 క్యూసెక్కుల వరద నీరు రావడంతో శనివారం నీటిమట్టం 406.20 అడుగులకు పెరిగింది. దీంతో ఒక గేట్ ఎత్తి 2వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి విడుదల చేసినట్లు ప్రాజెక్టు ఏఈ సురేష్ తెలిపారు.

మార్పు రాకుంటే.. మార్చక తప్పదు!

ఇల్లెందు అసమ్మతిపై హరీశ్ రావు ఘాటు వ్యాఖ్యలు

- హైదరాబాద్‌లో అర్ధరాత్రి జరిగిన అసమ్మతి పంచాయితీ
- పార్టీకి వ్యక్తుల కంటే శ్రేణులే ముఖ్యమన్న హరీశ్
- తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని సూచన
- హరిప్రియ, హరిసింగ్‌కు ఫోన్‌లో క్లాస్?



అసమ్మతి నేతలతో మంత్రి హరీశ్‌రావు, పక్కన ఎంపీలు కవిత, వద్దిరాజు, ఎమ్మెల్సీ తాతా మధు తదితరులు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ఇల్లెందు: నియోజకవర్గంలో అసమ్మతి వర్గాన్ని కలుపుకుని ముందుకు సాగని పక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియను మంత్రి హరీశ్‌రావు హెచ్చరించినట్టు సమాచారం. శుక్రవారం అర్ధరాత్రి రాష్ట్ర రాజధానిలో మంత్రి హరీశ్ రావు నివాసం వేదికగా ఇల్లెందు అసమ్మతి పంచాయితీ వాడీవేడిగా సాగింది.

రాజధానికి అసమ్మతి నేతలు..

ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్ తమను ఇబ్బంది పెడుతున్నారంటూ ఇల్లెందుకు చెందిన అసమ్మతి వర్గం ప్రజాప్రతినిధులు 100 మందికి పైగా మంత్రి హరీశ్‌రావును కలిసేందుకు శుక్రవారం హైదరాబాద్ వెళ్లారు. ముందుగా ఇల్లెందు నియోజకవర్గ ఇన్‌చార్జ్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఇంట్లో అసమ్మతి నేతలు సమావేశమయ్యారు. రాత్రి 9 గంటల నుంచి 11 గంటల వరకు ఒక్కో నేత తమకు ఎదురైన చేదు అనుభవాలను వివరించారు. అనంతరం అసమ్మతి వర్గం నుంచి ఐదురుగు నేతలే మంత్రి హరీశ్ ఇంటికి రావాలంటూ ఎంపీ వద్దిరాజు సూచించారు. దీనికి అసమ్మతి వర్గం నుంచి ప్రతిఘటన ఎదురైంది. ఇప్పటికే పార్టీ జిల్లా అధ్యక్షుడు, మంత్రులు, నియోజకవర్గ ఇన్‌చార్జ్‌ల సమక్షంలో జరిగిన సమావేశాల్లో తమకు ఊరట లభించలేదని, తామంతా నేరుగా మంత్రిని కలిసి తమ బాధను చెప్పుకుంటామని, లేదంటే ఇటు నుంచి ఇటే ఇల్లెందు వెళ్తామని తేల్చిచెప్పినట్టు తెలిసింది.

అర్ధరాత్రి హరీశ్‌రావు ఇంటికి..

రాత్రి 11:30 గంటల సమయంలో మంత్రి హరీశ్ రావు నివాసానికి అసమ్మతి వర్గం నేతలంతా చేరుకున్నారు. రాత్రి 12:05 గంటల సమయంలో తన పర్యటన ముగించుకుని నివాసానికి చేరుకున్న హరీశ్.. కాసేపటి తర్వాత అసమ్మతి వర్గ నేతలతో సమావేశమయ్యారు. జిల్లా అధికార ప్రతినిధి పులిగండ్ల మాధవరావు, ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లుతో పాటు ఇతర నేతలు నియోజకవర్గంలో పార్టీ పరంగా నెలకొన్న పరిస్థితిని మంత్రికి వివరించారు.

హరిసింగ్ మరో నయీం..

'నియోజకవర్గంలో పోలీసులు, తహసీల్దార్లు, ఇతర ప్రభుత్వ యంత్రాంగాన్ని ఉపయోగించుకుని ఎమ్మెల్యే హరిప్రియ భర్త హరిసింగ్ పాలన సాగించడంతో అనర్థాలకు దారి తీస్తోంద'ని అసమ్మతి నేతలు ఉదాహరణలతో సహా వివరించారు. మాట వినని వారిపై కేసులు నమోదు చేయడం సర్వసాధారణంగా మారిందని తెలిపారు. ఇల్లెందులో నయీం అవతారం ఎత్తిన హరిసింగ్ వల్లే పార్టీ పూర్తిగా విచ్ఛిన్నం అయిందని కొందరు అసమ్మతి నేతలు కుండబద్దలు కొట్టారు. అసమ్మతి నేతలు చెప్పే విషయాలను హరీశ్‌రావు సుమారు గంట పాటు ఓపికగా విన్నారు. ఆ తర్వాత ఆయన స్పందిస్తూ నియోజకవర్గంలో ఈ స్థాయిలో అసమ్మతి ఉంటుందని తాము ఊహించలేదన్నారు. పార్టీకి నాయకుల కంటే కేడరే ముఖ్యమని స్పష్టం చేశారు. పార్టీని నమ్ముకున్న కార్యకర్తలు, నేతల ఆత్మగౌరవం కాపాడటం తమ బాధ్యత అన్నారు. ఇకపై ఏమైనా ఇబ్బందులు ఎదురైతే ఎంపీలు వద్దిరాజు రవిచంద్ర, కవిత, ఎమ్మెల్సీ తాతా మధు దృష్టికి తీసుకురావాలని సలహా ఇచ్చారు.

ప్రత్యామ్నాయం చూడాల్సిందే..

హరిప్రియకు బీ ఫామ్ ఇవ్వొద్దని అసమ్మతి నేతలు పట్టుబట్టడంతో ప్రత్యామ్నాయ అభ్యర్థులు ఎవరున్నారని హరీష్‌రావు ప్రశ్నించారు. దీంతో అక్కడే ఉన్న ఎంపీ కవిత, మంత్రి సత్యవతి రాథోడ్‌తో పాటు ఎంపీపీ నాగరత్నమ్మ, కృష్ణప్రసాద్ మరికొన్ని పేర్లను అప్పటికప్పుడు అసమ్మతి నేతలు సూచించారు. హరిప్రియకు తప్ప ఎవరికి టికెట్ ఇచ్చినా గెలిపించుకుంటామని, ఆమెకు బీ ఫామ్ ఇస్తే పార్టీకి రాజీనామా చేస్తామని చెప్పారు. దీంతో ఇల్లెందులో నెలకొన్న పరిస్థితులను కేసీఆర్ దృష్టికి తీసుకెళ్తామని, ఆయన తగు నిర్ణయం తీసుకుంటారని హరీశ్ హామీ ఇచ్చారు. అప్పటి వరకు తొందరపడి ఎలాంటి నిర్ణయం తీసుకోవద్దని మంత్రి సూచించారు. దీంతో అర్ధరాత్రి 1:30 గంటల సమయంలో అసమ్మతి నేతలంతా తిరుగు ప్రయాణం అయ్యారు.

ఫోన్‌లో మందలింపు!

అసమ్మతి నేతలతో సమావేశం ముగిసిన తర్వాత మంత్రి హరీశ్ ఎమ్మెల్యే హరిప్రియ, ఆమె భర్త హరిసింగ్‌కు ఫోన్ చేసినట్టు సమాచారం. నియోజకవర్గంలో ఇంత అసమ్మతి పెట్టుకుని 50 వేల ఓట్ల మెజార్టీతో గెలుస్తానని ఎలా చెబుతున్నారంటూ ప్రశ్నించినట్లు తెలిసింది. 'మరోసారి అసమ్మతి అంటూ మీ దగ్గరి నుంచి ఇక్కడికి ఎవరూ రావొద్దు. వారం పది రోజుల్లో అసమ్మతిని చల్లార్చి వారితో కలిసి ఇక్కడికి రావాల'ని ఆదేశించినట్టు సమాచారం. ఇకపై పార్టీ నేతలు, కేడర్‌ను ఇబ్బంది పెడితే తీవ్ర నిర్ణయం తీసుకోవడానికి వెనుకాడమంటూ హెచ్చరించినట్టు తెలుస్తోంది. మంత్రి హరీశ్ రావు ఫోన్‌లో ప్రశ్నల వర్షం కురిపిస్తుంటే ఇటు హరిసింగ్ వైపు నుంచి సమాధానాలు కరువైనట్టు తెలిసింది. అంతకు ముందు ఇరు వర్గాలతో సమావేశం నిర్వహించాలని బీఆర్‌ఎస్ పెద్దలు భావించినా.. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఎంపీ వద్దిరాజు, మంత్రి హరీశ్ రావు నివాసాల్లో జరిగిన సమావేశాలకు ఎమ్మెల్యే హరిప్రియను దూరంగా ఉంచారు.

కోర్టును తనిఖీ చేసిన జిల్లా జడ్జి



కోర్టుల నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న జడ్జీలు వసంత్ పాటిల్, కీర్తిచంద్రికా రెడ్డి

ఇల్లెందు: ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టును జిల్లా జడ్జి వసంత్ పాటిల్ శనివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్థానిక కోర్టు జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రికా రెడ్డి న్యాయమూర్తి వసంత్‌కు పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సత్కరించారు. ఆ తర్వాత ఫారెస్ట్ గ్రౌండ్‌లో కోర్టుల నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణాలకు త్వరలో నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పీడీఎం జడ్జి బి.రామారావు, కొత్తగూడెం కోర్టు ఏఓ అనితావాణి, ఇల్లెందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మామిడి సత్యప్రకాష్, జాయింట్ సెక్రటరీ కీర్తి కార్తీక్, ఉమామహేశ్వరరావు, సీనియర్ న్యాయవాది దంతాల ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుహక్కు సద్వినియోగం చేసుకోవాలి

కలెక్టర్ ప్రియాంక ఆల



మాట్లాడుతున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఓటు ప్రాథమిక హక్కని, ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అన్నారు. కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో శనివారం పరిశ్రమల అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఓటు హక్కు నమోదు, వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిశ్రమల్లో పనిచేసే కార్మికులతో పాటు వారి కుటుంబ సభ్యులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని అన్నారు. అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారంతా అర్హులేనని తెలిపారు. కార్మికులు, ఉద్యోగులకు ఓటు ప్రాముఖ్యత తెలియజేసేలా పరిశ్రమల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని యాజమాన్యాలకు సూచించారు. ఓటర్ హెల్ప్‌లైన్, ఎన్‌వీఎస్‌పీ యాప్ ద్వారా ఓటు నమోదు చేసుకోవచ్చని వివరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు రాంబాబు, మధుసూదన్ రాజు, పరిశ్రమల శాఖ అధికారి సీతారాం, సింగరేణి జీఎం బసవయ్య, కేటీపీఎస్ సీఈలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రావు, నవభారత్ డీజీఎం శంకరయ్య, ఐటీసీ అధికారి హరిప్రసాద్ పాల్గొన్నారు.

రేపు ప్రజావాణి రద్దు

ప్రజాసమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని ఈనెల 2న గాంధీ జయంతి సందర్భంగా రద్దు చేసినట్లు కలెక్టర్ ప్రియాంక ఆల శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ప్రభుత్వ సెలవు కావడంతో తాత్కాలికంగా రద్దు చేశామని, ప్రజలు ఈ విషయాన్ని గమనించి ఎవరూ రావొద్దని కోరారు.

జిల్లాలో నేడు మెగా శ్రమదానం



విద్యానగర్‌లో శ్రమదానం చేస్తున్న అధికారులు, విద్యార్థులు

చుంచుపల్లి: 'పరిశుభ్రత కోసం చేతులు కలుపుదాం ' అనే నినాదంతో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపులో భాగంగా జిల్లాలో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి 11 గంటల వరకు మెగా శ్రమదాన కార్యక్రమాలు చేపట్టనున్నారు. సెప్టెంబర్ 15 నుంచి జిల్లాలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు చురుగ్గా నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. దానిలో భాగంగా ఒక గంట పాటు ప్రభుత్వ కార్యాలయాలు, ఇంటి పరిసరాలను శుభ్రం చేసేందుకు చేపట్టనున్న శ్రమదానంలో అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొంటారు. జిల్లాలోని 481 గ్రామ పంచాయతీలు, నాలుగు మున్సిపాలిటీల్లో ఈ కార్యక్రమాలను చేపట్టేందుకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. కాగా, మండలంలోని విద్యానగర్‌లో శనివారం అధికారులు, విద్యార్థులు శ్రమదానం చేశారు.

డ్వాక్రా సేల్ మేళా ప్రారంభం



మేళా ప్రారంభిస్తున్న థాలే దంపతులు

అశ్వాపురం: మండల కేంద్రంలోని భారజల కర్మాగారం అధికారులు, ఉద్యోగుల నివాస సముదాయమైన గౌతమీనగర్ కాలనీలో అభ్యుదయ గ్రామీణ డ్వాక్రా స్టేట్ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేల్ మేళాను భారజల కర్మాగారం జీఎం కేవీ.థాలే దంపతులు శనివారం ప్రారంభించారు. అక్టోబర్ 10 వరకు ఈ మేళా నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా థాలే మాట్లాడుతూ.. ప్రతి ఏడాది భారజల కర్మాగారం కో ఆపరేటివ్ కన్జూమర్ స్టోర్స్ లిమిటెడ్ వారి సహకారంతో నిర్వహించే ఈ సేల్ మేళాను కాలనీ వాసులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డీజీఎంలు పీజేవీ.సుధాకర్, జగ్గారావు, సీహెచ్.కోటేశ్వరరావు, ఈసీసీ స్టోర్స్ సెక్రటరీ టీఎస్‌పీ.రవికుమార్, వైస్ ప్రెసిడెంట్ పెంటి సురేష్, డైరెక్టర్లు రమేష్, కపిల్ థానల్, భారతి, డ్వాక్రా లీడర్ కోటా దేవకిదేవి, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

మిరప పంటకు తెగుళ్ల బెడద

దిగుబడి రాదని పంట తొలగించిన రైతులు



మిరప తోటను తొలగిస్తున్న రైతు (ఇన్‌సెట్) తెగులు సోకిన మొక్కలతో రైతు అప్పారావు

జూలూరుపాడు: జూలూరుపాడు మండలంలోని పలు గ్రామాల్లో రైతులు సాగు చేసిన మిరప పంటకు గుబ్బతెగులు సోకింది. వెంగన్నపాలెంకు చెందిన కొమ్మగిరి అప్పారావు ఆరెకరాల్లో మిరప సాగు చేయగా.. గుబ్బతెగులు, వేరు తెగులుతో పంట దెబ్బతిన్నది. ఇప్పటికే ఎకరాకు రూ.70వేల చొప్పున రూ.4.20 లక్షల వరకు వెచ్చించిన ఆయన తెగుళ్ల నివారణకు మందులు వాడినా ఫలితం లేకపోవడంతో శనివారం ట్రాక్టర్ రోటవేటర్‌తో పంట తొలగించాడు. అలాగే, సాయిరాంతండాకు చెందిన హలావత్ నర్సింహారావు రెండెకరాల్లో సాగు చేసిన మిరపకు కూడా తెగుళ్లు సోకి మొక్క పెరుగుదల ఆగింది. ఆయన ఇప్పటివరకు రూ.1.50లక్షలు పెట్టుబడి పెట్టగా ఇక ప్రయోజనం లేదనుకుని పంట తొలగించాడు.

ఖమ్మంపై గులాబీ గురి

- మూడు నియోజకవర్గాల్లో మంత్రి కేటీఆర్ సుడిగాలి పర్యటన
- రూ.1,797.52 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు
- సీతారామ ప్రాజెక్టు పూర్తయితే ఏడున్నర లక్షల ఎకరాలకు నీళ్లు
- ఖమ్మం, సత్తుపల్లి ప్రగతి నివేదన సభల్లో వెల్లడి



సత్తుపల్లి సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్, వేదికపై మంత్రి పువ్వాడ, ఎంపీలు నామా, రవిచంద్ర, ఎమ్మెల్యే వెంకటవీరయ్య, ఎమ్మెల్సీ మధు తదితరులు

సాక్షి ప్రతినిధి ఖమ్మం: ఖమ్మం జిల్లాపై గులాబీ పార్టీ గురి పెట్టింది. పురపాలక, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ ఎన్నికల శంఖారావం పూరించారు. ఖమ్మం, సత్తుపల్లి, వైరా నియోజకవర్గం గుబ్బగుర్తిలో రూ.1,797.52 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, ఎంపీలు నామ నాగేశ్వరరావు, వద్దిరాజు రవిచంద్ర, బండి పార్థసారథిరెడ్డి, ఎమ్మెల్సీ తాతా మధు, ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, లావుడ్యా రాములునాయక్, కందాల ఉపేందర్‌రెడ్డితో కలిసి శనివారం ప్రారంభోత్సవం, శంకుస్థాపనలు చేశారు. భద్రాచలం కూడా వెళ్లాల్సి ఉన్నా వర్షం కారణంతో రద్దయింది. ఖమ్మం కార్పొరేషన్ ఎదుట, ఎన్టీఆర్ పార్కు, గుబ్బగుర్తి, సత్తుపల్లిలో ఆయన మాట్లాడుతూ.. గత తొమ్మిదేళ్లలో ఉమ్మడి ఖమ్మం జిల్లా అభివృద్ధికి ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించడంతో పాటు గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఏం చేసిందంటూ విమర్శలు ఎక్కుపెట్టారు. అలాగే, పార్టీ మారిన మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఉద్దేశించి పరోక్షంగా విమర్శలు గుప్పించిన కేటీఆర్.. టికెట్ ఇవ్వకపోయినా కేసీఆర్ వెంటే ఉంటానన్న వైరా ఎమ్మెల్యే రాములునాయక్‌ను ప్రశంసించారు. మూడు నియోజకవర్గాల్లో జరిగిన కార్యక్రమాల్లో ఆయన ముఖ్యమంత్రి కేసీఆర్ ఉమ్మడి ఖమ్మం జిల్లాకు ఏం చేసారో ప్రస్తావించటంతో పాటు మంత్రి పువ్వాడ అజయ్, ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, బాణోత్ మదన్‌లాల్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. కేటీఆర్ ప్రసంగం ఆయన మాటల్లోనే..

ఆకాశమంత అభివృద్ధికి చిరునామా..

ఖమ్మం, పాలేరు నియోజకవర్గాల్లో మున్నేరుకు కరకట్టతోపాటు మున్నేరుపై తీగల వంతెన, లకారంలో కొత్తగా ఏర్పాటు చేస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన చేసుకున్నాం. గుబ్బగుర్తి వద్ద ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీకి శంకుస్థాపన జరిగింది. ఆకాశమంత అభివృద్ధికి చిరునామా మన ఖమ్మం. మంత్రి పువ్వాడ సారథ్యాన హైదరాబాద్ తర్వాత ఖమ్మంలో అతిపెద్దదైన ఆర్టీసీ బస్టాండ్ నిర్మించాం. రూ.230 కోట్లతో మిషన్ భగీరథ ద్వారా 50 వేల కొత్త కనెక్షన్లు ఇస్తూ తాగునీటి సమస్య పరిష్కరించాం. కేసీఆర్ నాయకత్వంలో ఖమ్మం, కొత్తగూడెంకు మెడికల్ కాలేజీలు, రెండు నర్సింగ్ కాలేజీలు ఏర్పాటయ్యాయి. ప్రత్యేకించి జేఎన్‌టీయూ కళాశాల కూడా ఖమ్మంకు మంజూరు చేశారు.

ఆగమవుదామా.. అభివృద్ధిలో భాగం అవుదామా?

కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలంటూ ఊదరగొడుతోంది. అయితే, చెబుతున్న వారికే సీటు గ్యారంటీ లేదు.. పార్టీకి వారంటీ లేదు. ఆరిపోయే దీపం లాంటిది ఆ పార్టీ. ఆకాశంలో చంద్రుడిని సత్తుపల్లి చౌరస్తాలో కట్టేస్తాం. కేసీఆర్ ఒకటి అంటే మేము రెండు చేస్తామని ఊదరగొడుతున్నారు. ఈ డైలాగులకు ఆగమవుదామా.. అభివృద్ధిలో భాగం అవుదామా.. అనేది మీరే ఆలోచించాలి. అభివృద్ధి సాగాలన్నా, ప్రగతి రథచక్రాలు ముందుకు సాగాలన్నా మీ ఆశీర్వాదాలు ఉండాలి. కేసీఆర్ హ్యాట్రిక్ సీఎం కావడం ఖాయం. ఇంత అభివృద్ధి చేసిన మంత్రి పువ్వాడ అజయ్‌ను మళ్లీ గెలిపించండి.

సత్తుపల్లి చైతన్యవంతమైన ప్రాంతం

సత్తుపల్లి చైతన్యవంతమైన ప్రాంతం. రాజకీయాల్లో పార్టీలు మారడం సహజమే. కానీ టికెట్ ఇవ్వలేదని కేసీఆర్ దుర్మార్గుడని నిందిస్తే ఎంత వరకు సమంజసం? సత్తుపల్లిలో 100 పడకల ఆస్పత్రి, పెనుబల్లి, కల్లూరుల్లో 50 పడకల ఆస్పత్రులు ఏర్పాటు చేశాం. రూ.125 కోట్ల విలువైన పనులకు శంకుస్థాపన చేసుకున్నాం. అలాగే, సత్తుపల్లికి నర్సింగ్ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల మంజూరు చేశాం. సీతారామతో కాళ్లు కడుగుతామని చెబుతున్న నేతలు గత ప్రభుత్వాల్లో ఉన్నప్పుడు ఎందుకు చేయలేదు? సీతారామ ప్రాజెక్టు 90 శాతం పూర్తికాగా, మిగతాది పూర్తికాగానే ఏడాదిలో సత్తుపల్లి నియోజకవర్గంలో 2లక్షల ఎకరాలకు నీళ్లు వస్తాయి. గోదావరి జలాలు తెచ్చి, ఖమ్మం, కొత్తగూడెం జిల్లాల్లో 7.50 లక్షల ఎకరాలకు నీళ్లు తెచ్చేది బీఆర్‌ఎస్ ప్రభుత్వమే. సత్తుపల్లి ప్రత్యేక జిల్లా కావాలని అడుగుతున్నారు.. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా వెంకటవీరయ్యను 60 వేల నుంచి 70 వేల మెజారిటీతో గెలిపించండి.. ఆ డిమాండ్ కూడా నెరవేర్చుకుందాం' అన్నారు. ఆయా కార్యక్రమాల్లో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వర్షంతో భద్రాద్రి పర్యటన రద్దు

- నిరుత్సాహానికి గురైన బీఆర్‌ఎస్ శ్రేణులు

భద్రాచలం : భద్రాచలంలో శనివారం జరగాల్సిన రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కల్వకుంట్ల తారక రామారావు పర్యటన వర్షంతో రద్దయింది. ఖమ్మం నుంచి హెలికాప్టర్ ద్వారా భద్రాచలానికి చేరుకునేలా ముందుగా షెడ్యూల్ ఖరారైంది. కానీ ఖమ్మం నుంచి కేటీఆర్ బయలుదేరిన సమయంలోనే భద్రాచలంలో భారీగా ఉరుములు, పిడుగులతో వర్షం పడింది. ఈ విషయాన్ని స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు సమాచారం అందజేయడంతో భద్రాచలం రాకుండా హెలికాప్టర్‌ను సత్తుపల్లికి దారి మళ్లించారు. దీంతో భద్రాచలంలో కేటీఆర్ పర్యటన రద్దయినట్టుగా పార్టీ నాయకులు ప్రకటించారు. కాగా భద్రాచలానికి తొలిసారి కేటీఆర్ వస్తున్న క్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేపట్టారు. పట్టణమంతా ఫ్లెక్సీలు, జెండాలతో గులాబీమయం చేశారు. చర్ల, దుమ్ముగూడెం, వాజేడు, వెంకటాపురం మండలాల నుంచి ముఖ్య కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు భద్రాచలం చేరుకున్నారు. భద్రాద్రిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయాల్సి ఉండగా, చివరి నిమిషంలో పర్యటన రద్దు కావడంతో పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు నిరుత్సాహానికి గురయ్యారు. ఇక కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బందోబస్తు విధులకు వచ్చిన మహిళా పోలీసు ఉద్యోగి అన్నదాన సత్రం వద్ద డ్రెయినేజీలో పడి మృతి చెందడం అపశ్రుతిగా పలువురు భావిస్తున్నారు.

పొర్లుదండాలతో వినూత్న నిరసన



21 రోజులుగా సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు శనివారం అశ్వాపురంలోని రామాలయంలో పొర్లు దండాలు పెడుతూ వినూత్న రీతిలో నిరసన తెలిపారు. సీఎం కేసీఆర్ తమ సమస్య పరిష్కరించేలా చూడాలని రామయ్యను వేడుకున్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డి అరుణ, కోరెం శ్రీలత, హంసవేణి, రమాదేవి, విజయలక్ష్మి, నాగమణి, కళ్యాణి, విజయ, భారతి, రాయపూడి రాజేష్, ఈనపల్లి సాయి పాల్గొన్నారు.

– అశ్వాపురం

క్లుప్తంగా

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణం తొలగింపు


అక్రమ నిర్మాణాన్ని తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

కొత్తగూడెంఅర్బన్: సర్కారు స్థలంలో అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాన్ని శనివారం రెవెన్యూ, మున్సిపల్ అధికారులు జేసీబీతో తొలగించారు. 'సర్కారు స్థలంపై గులాబీ కన్ను' శీర్షికన గత గురువారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ప్రభుత్వ స్థలంలో అక్రమంగా నిర్మాణం చేపడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ హలీం, వీఆర్ఏలు జావిద్, రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఐటీఐల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

మణుగూరు రూరల్ : ప్రభుత్వ, ప్రైవేట్ ఐటీఐలలో ఐదో విడత ప్రవేశాల కోసం విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మణుగూరు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ బి.ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, డ్రాఫ్ట్‌మెన్ సివిల్, మెకానికల్, కంప్యూటర్ ప్రోగ్రామింగ్ అసిస్టెన్స్(కోపా) కోర్సుల్లో ప్రవేశం కోరేవారు ఈ నెల 1 నుంచి 8వ తేదీలోగా సంబంధిత ధ్రువపత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

క్రీడల్లో విద్యార్థులు రాణించాలి


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కేటీపీఎస్ సీఈ వెంకటేశ్వరరావు

పాల్వంచ: విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావు సూచించారు. పట్టణంలోని కేటీపీఎస్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల జోనల్ స్థాయి క్రీడా పోటీలను శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకుని చిన్నతనం నుంచే కృషి చేయాలని చెప్పారు. కాగా బూర్గంపాడు, ములకలపల్లి, పాల్వంచ మండలాల విద్యార్థులు క్రీడల్లో పాల్గొనగా, కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమలో కేటీపీఎస్ ఎస్ఈ (సివిల్) యుగపతి, ఇంజనీర్లు శేఖర్, కిశోర్, మధు బాబు, ఎంఈఓ శ్రీరామ్మూర్తి, జిల్లా పరీక్షల కన్వీనర్ మాధవరావు, జిల్లా గేమ్స్ ఫెడరేషన్ సెక్రటరీ స్టెల్లా, హెచ్ఎం కుమారి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


రైళ్ల రద్దు పొడగింపు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం (భద్రాచలం రోడ్డు) రైల్వేస్టేషన్ నుంచి నడిచే పలు రైళ్లను రద్దు చేయగా, ఈ నిర్ణయం మరికొన్నాళ్లు అమల్లో ఉంటుందని అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగూడెం నుంచి విజయవాడ వరకు వచ్చివెళ్లే ప్యాసింజర్ రైలు, కొత్తగూడెం నుంచి బల్లార్ష వరకు నడిచే రైళ్లు అక్టోబర్ 10వ తేదీ వరకు, సిర్పూర్‌కాగజ్‌నగర్ నుంచి కొత్తగూడెం వరకు వచ్చివెళ్లే సింగరేణి ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 8వ తేదీ వరకు నడవవని ప్రకటించారు. కాగా, సింగరేణి ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 2వ తేదీ నుంచి ప్రారంభం కానుందని సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని నమ్మొద్దని అధికారులు కోరారు.

మద్యం మత్తులో ఆత్మహత్య

చర్ల: మండల కేంద్రంలోని రైస్‌పేటకు చెందిన ఓ వ్యక్తి శనివారం మద్యం మత్తులో బ్లేడుతో గొంతు కోసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. నేపాల్‌కు చెందిన బెహరా రాజేందర్ (50) కుటుంబం కొన్నేళ్లుగా రైస్‌పేటలో నివాసం ఉంటోంది. గూర్ఖాగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్న రాజేందర్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో శనివారం కూడా మద్యం తాగి ఇంటి వద్దనే బ్లేడ్‌తో గొంతుకోసుకున్నాడు. రక్తస్రావం అవుతుండగా కుటుంబ సభ్యులు 108 ద్వారా చర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అక్కడి నుంచి భద్రాచలం ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు.

రేషన్ షాప్ సీజ్


బియ్యం నిల్వలను పరిశీలిస్తున్న అధికారులు

టేకులపల్లి: మండలం పరిధిలోని లచ్చగూడెంలో ఉన్న రేషన్ షాపును సివిల్ సప్లయీస్ అధికారులు శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డుల ప్రకారం ఉండాల్సిన బియ్యం కంటే 31 క్వింటాళ్ల బియ్యం తక్కువగా ఉండటంతో విచారణ నిర్వహించి షాప్‌ను సీజ్ చేశారు. డీలర్‌పై 6ఏ కేసు నమోదు చేసినట్లు డీటీ మహేష్ తెలిపారు.

వృద్ధాప్యంలోనూ సమాజ సేవ

- ఆదర్శంగా నిలుస్తున్న విద్యానగర్ సీనియర్ సిటిజన్స్
- నేడు అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం


వయోవృద్ధులను సన్మానిస్తున్న సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ బాధ్యులు

చుంచుపల్లి: కొందరు వయోవృద్ధులు సామాజిక సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు. వయోభారం ఇబ్బంది పెడుతున్నా సమాజ హితం కోసం తమ వంతు కృషి చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆ కోవలోకే వస్తారు చుంచుపల్లి మండలం విద్యానగర్ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు. నేడు ప్రపంచ వృద్ధుల దినోత్సవం సందర్భంగా వారిపై కథనం.

అలుపెరుగని సేవకులు

2013–14లో వివిధ ప్రభుత్వ రంగ సంస్థల నుంచి ఉద్యోగ విరమణ పొంది, చుంచుపల్లి విద్యానగర్ కాలనీలో నివాసంఉంటున్న వారంతా తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్‌గా ఏర్పడ్డారు. దాదాపు 68 నుంచి 85 ఏళ్ల లోపు వయసు ఉన్న 60 మంది సభ్యులు సంఘంగా ఏర్పడి సమాజసేవలో భాగస్వాములవుతున్నారు. విద్యానగర్ మండల ప్రజా పరిషత్ పాఠశాలను దత్తత తీసుకుని అభివృద్ధికి పాటుపడుతున్నారు. బల్లలు, ఫ్యాన్లు పుస్తకాలను అందిస్తున్నారు. కొత్తగూడెంలోని జ్యోతి అనాథ వృద్ధుల ఆశ్రమానికి నిత్యావసరాలు అందిస్తూ తోడ్పాటునందిస్తున్నారు. గర్భిణులకు చీరలు, పూలు, పండ్లు, పౌష్టికాహారం, అనాథలకు, వృద్ధులకు, దివ్యాంగులకు సరుకులు, దుస్తులు అందజేస్తున్నారు. సంఘం ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించి, కంటి చూపు తదితర పరీక్షలు చేయిస్తున్నారు. కళ్ల జోళ్లను పంపిణీ చేస్తున్నారు. కొత్తగూడెం, రేగళ్ల, గట్టుమళ్ల తదితర ప్రాంతాల్లో గిరిజనులకు దుస్తులు, నిత్యావసర వస్తువులను పంపిణీ చేస్తున్నారు.

వివక్ష చూపితే హక్కుల ఉల్లంఘనే..

సమాజంలో కొన్నిచోట్ల వృద్ధులు నిరాదరణకు గురవుతుంటారు. అయితే వృద్ధుల పట్ల ఎవరైనా వివక్ష చూపితే అది మానవ హక్కుల ఉల్లంఘన కిందకే వస్తుంది. న్యాయం కోసం హక్కుల కమిషన్, న్యాయస్థానాల సహాయం తీసుకోవచ్చు. సీఆర్‌పీసీలోని (సెక్షన్125) మెయింటెనెన్స్ ఆఫ్ పేరెంట్స్ యాక్ట్ ప్రకారం కన్నవారికి జీవనభృతి ఇవ్వాలని కోర్టు ఆదేశిస్తుంది. ఇక వృద్ధులకు అందించే పెన్షన్స్‌కు దాదాపు 164 ఏళ్ల చరిత్ర ఉంది. ఇక జిల్లాలో 62 ఏళ్లు దాటి, రూ.2,016 వృద్ధాప్య పెన్షన్ పొందుతున్నవారు 47,136 మంది ఉన్నారు. మరో 5,127 మంది వరకు సీనియర్ సిటిజన్లు ఉన్నారు. కాగా ప్రతి ఏడాది అక్టోబర్ 1న అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్య సమితి ప్రకటించింది. దీంతో ఏటా జిల్లాలో వయోవృద్ధుల సంక్షేమ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు.

సేవా కార్యక్రమాలతోనే సంతృప్తి



సీనియర్ సిటిజన్స్ అందరం అసోసియేషన్‌గా ఏర్పడి మా శక్తి మేరకు సమాజ సేవ చేస్తున్నాం. మానవ సేవ సభ్యులం దరికీ సంతృప్తినిస్తోంది. అసోసియేషన్ సభ్యులతో పాటు అధికారులు, ప్రజల తోడ్పాటు మరువలేనిది.

–కొల్లు నాగేశ్వరరావు, తెలంగాణ సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు

కొత్తగూడెంలో 115 శాతం బొగ్గు ఉత్పత్తి



మాట్లాడుతున్న జీఎం శాలెంరాజు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో సెప్టెంబర్ మాసంలో కంపెనీ నిర్దేశించిన 9.39 లక్షల టన్నుల లక్ష్యాన్ని మించి 10.83 లక్షల టన్నుల బొగ్గు వెలికితీసి, 115 శాతం నమోదు చేసినట్లు జీఎం ఎం.శాలెంరాజు తెలిపారు. శనివారం జీఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. రోడ్డు, రైలు మార్గం ద్వారా 12.45 లక్షల టన్నుల బొగ్గు రవాణా చేశామని తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఏప్రిల్ నుంచి సెప్టెంబర్ వరకు 59.31 లక్షల టన్నుల లక్ష్యం నిర్దేశించగా, 67. 61 లక్షల టన్నుల బొగ్గు వెలికి తీసి, 114 శాతం ఉత్పత్తి నమోదు చేసినట్లు పేర్కొన్నారు. జేవీఆర్ ఓసీ–2లో 118 శాతం, కిష్టారం ఓసీలో 119 శాతం, పీవీకే –5షాఫ్ట్ భూగర్భ గనిలో 46 శాతం ఉత్పత్తి సాధించినట్లు పేర్కొన్నారు. ఏరియాలో 526 మందికి వారసత్వ ఉద్యోగాలు కల్పించామని, 58 మందికి లమ్‌సమ్ అమౌంట్ కింద నగదు చెల్లించామని, ఒక్కరికి మంత్లీమానిటరింగ్ స్కీం (ఎంఎంసీ) కింద నెలసరి వేతనం, 352 మందికి ఇంటి రుణంపై వడ్డీ చెల్లిస్తున్నామని వివరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు కోటిరెడ్డి, దుర్గాప్రసాద్, రామకృష్ణ, కె.హేన సుమలత, రవీందర్, శివకేశవరావు, ఎస్.యోహాన్, బి.తావుర్యా, సిబ్బంది రామ్లా ప్రసాద్, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

అందరూ మార్పు కోరుతున్నారు..

కాంగ్రెస్ నాయకుడు లక్కినేనితో బీజేపీ నేత ధర్మారావు భేటీ


మాట్లాడుతున్న మార్తినేని ధర్మారావు, పక్కన లక్కినేని, శ్రీధర్‌రెడ్డి తదితరులు

టేకులపల్లి: రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల నేపథ్యాన అందరూ మార్పు కోరుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మార్తినేని ధర్మారావు పేర్కొన్నారు. బీజేపీ నాయకులతో కలిసి శనివారం ఆయన టేకులపల్లిలో కాంగ్రెస్ నాయకుడు, పీఏసీ ఎస్ అధ్యక్షుడు లక్కినేని సురేందర్‌రావుతో భేటీ అయ్యారు. ఆయనను బీజేపీలో చేరాలని ఆహ్వానించాక ధర్మారావు మాట్లాడారు. పార్టీకి లక్కినేని అవసరాన్ని గుర్తించి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, ఈటల రాజేందర్ సూచన మేరకే ఆహ్వానించేందుకు వచ్చానని తెలిపారు. అనంతరం సురేందర్‌రావు మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గం సీటు కోసం దరఖాస్తు చేసుకోగా, పార్టీ పెద్దలు సర్వేలు చేపట్టకుండానే అభ్యర్థిని ఎంపిక చేస్తున్నట్లు తెలిసి మనస్తాపం చెందానని అన్నారు. అనుచరులు, అభిమానులతో చర్చించి నిర్ణయం వెలువరిస్తానని, అయితే మార్పు తప్పకుండా ఉంటుందని చెప్పారు. మాజీ ఎమ్మెల్యే ఊకె అబ్బయ్య, నాయకులు నాళ్ల సోమసుందర్, సురేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సీతారాం నాయక్, గంపల సీతారామరాజు, పెద్దపల్లి శ్రీనివాస్, గిరిధర్‌రెడ్డి, బలగాని గోపీకృష్ణ, బాలాజీ, హత్తీరాం, పూన్యా, రమేష్, నరేష్, సంజీవ్‌రెడ్డి పాల్గొన్నారు.

చెట్టును ఢీకొట్టిన వ్యాన్

డ్రైవర్‌కు తీవ్ర గాయాలు

అశ్వారావుపేటరూరల్: మండలంలోని ఊట్లపల్లి గ్రామసమీపంలో శనివారం తెల్లవారుజామున ఓ ఐషర్ వ్యాన్ అదుపుతప్పి చెట్టును ఢీ కొట్టింది. దీంతో మహారాష్ట్రకు చెందిన వ్యాన్ డ్రైవర్ లూలకర్ గోరల్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు చిట్టి తల్లి సేవా సమితి అంబులెన్స్ ద్వారా అశ్వారావుపేట ప్రభుత్వ సామాజిక ఆస్పత్రికి తరలించారు. పరీక్షించి వైద్యులు ప్రథమ చికిత్స చేసి, మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

పెద్దమ్మతల్లి గుడిలో అభిషేకం టికెట్ ధర పెంపు

పాల్వంచరూరల్: పాల్వంచ మండలం కేశవాపురం – జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువైన శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో ఆర్జిత సేవా టికెట్ ధర ఆదివారం నుంచి పెంచనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. అమ్మవారి అభిషేక పూజ టికెట్ రూ.100 ఉండగా రూ.200కు పెంచినట్లు పేర్కొన్నారు. అలాగే, రూ.15 ఉన్న లడ్డూ ధరను రూ.20కి, రూ.10గా ఉన్న పులిహోర ప్రసాదం ధరను రూ.20కి పెంచుతున్నట్లు వెల్లడించారు.

షాపుల కేటాయింపునకు 3న వేలం

పెద్దమ్మతల్లి ఆలయం వద్ద నిర్మించిన కాంప్లెక్స్‌లో షాపులు కేటాయించేందుకు ఈ నెల 3వ తేదీన వేలం నిర్వహించనున్నట్లు ఈఓ ఎస్.రజనీకుమారి తెలిపారు. కాంప్లెక్స్‌లోని తొమ్మిది షాపులను మూడేళ్ల పాటు లీజ్‌కు ఇచ్చేందుకు వేలం ఉంటుందని, ఆసక్తి ఉన్న వారు రూ.200 చెల్లించి షెడ్యూల్ ఫాం పొందడంతో పాటు షాపు ఒక్కంటికి రూ.50 వేల ధరావత్తు చెల్లించి పాల్గొనాలని సూచించారు. కాగా, ఆలయం ఎదుట నిర్మించిన రెండు ఏసీ ఫంక్షన్ హాళ్లను ఈ నెల 4న ప్రారంభించనున్నట్లు ఈఓ తెలిపారు.

క్రీడల్లో అశ్వారావుపేట గురుకులం సత్తా

అశ్వారావుపేటరూరల్: జిల్లా స్థాయిలో జరిగిన క్రీడా పోటీల్లో అశ్వారావుపేట మైనారిటీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులు సత్తాచాటారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. విజేతలను పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు టీ.సంగీత అభినందించారు. శనివారం ఆమె వివరాలు వెల్లడించారు. గత నెల 24వ తేదీ నుంచి 27వ తేదీ వరకు వైరా బాలికల పాఠశాలలో జరిగిన స్పోర్ట్స్ జోష్ మీట్ 2023–24లో పాఠశాల నుంచి 73 మంది విద్యార్థులు హాజరయ్యారని తెలిపారు. అండర్–14 విభాగంలో వాలీబాల్, కబడ్డీ, డిస్క్ త్రో, రన్నింగ్, చెస్ పోటీల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచారని పేర్కొన్నారు. అండర్–17 విభాగంలో ఖోఖో, వాలీబాల్, 800, 400, 100 మీటర్ల పరుగు పందెల్లో ద్వితీయ స్థానం సాధించినట్లు తెలిపారు. 20 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించారని అన్నారు. క్రీడల్లో విద్యార్థులను తీర్చిదిద్దిన పీఈటీ ప్రమీలను ప్రత్యేకంగా అభినందించారు.

ఏవండీ.. ఇంటికి త్వరగా వెళ్లండి..


ఇంటి వద్ద శ్రీదేవి భర్త రామారావును ఓదారుస్తున్న తోటి సిబ్బంది

- భర్త రామారావుతో అవే ఆఖరు మాటలు
- మంత్రి బందోబస్తుకు భద్రాచలం వెళ్లి అనంతలోకాలకు..
- డ్రెయిన్‌లో పడి వన్‌టౌన్ మహిళా హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి మృతి
- న్యూగొల్లగూడెంలోని ఇంటి వద్ద విషాదఛాయలు


వన్‌టౌన్‌లో విధుల్లో హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి(కళ్ల జోడు పెటుకున్న మహిళ)

కొత్తగూడెంటౌన్: 'ఏవండీ ఇంటికి త్వరగా వెళ్లండి. త్వరగా భోజనం చేయండి. నేను కేటీఆర్ పర్యటన పూర్తికాగానే సాయంత్రం తొందరగా ఇంటికి వస్తాను' అని చెప్పి వెళ్లిన శ్రీదేవి తిరిగిరాలేదంటూ భర్త రామారావు గుండెలవిసేలా రోదిస్తున్నాడు. ఎప్పటిలాగే డ్యూటీకి వెళ్లి తిరిగి వస్తుందనుకున్న అమ్మ ఇక రాకపోవడంతో కూతురు, కుమారుడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో బందోబస్తు విధులకు వెళ్లి ప్రమాదవశాత్తు డ్రెయినేజీలో పడి మహిళా హెడ్‌కానిస్టేబుల్ పల్లపు శ్రీదేవి(49) మృతి చెందింది. 1995లో పోలీస్ కానిస్టేబుల్‌గా విధుల్లో చేరిన ఆమె జిల్లాలోని వివిధ ఠాణాల్లో పనిచేసింది. హెడ్ కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందింది. ఇటీవల వరకు పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో పనిచేయగా, 15 రోజుల క్రితమే కొత్తగూడెం వన్‌టౌన్‌లో విధుల్లో చేరింది. ఆమె భర్త రామారావు కూడా ఎస్‌బీ విభాగంలో కొత్తగూడెంలోనే కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శనివారం మంత్రి కేటీఆర్ భద్రాచలం పర్యటన ఉన్న నేపథ్యంలో ఆమెకు బందోబస్తు విధులు కేటాయించారు. ఉదయం ఇంటి నుంచి బయల్దేరేటప్పుడు సమయానికి భోజనం చేయడంటూ జాగ్రత్తలు చెప్పి వెళ్లింది. మంత్రి పర్యటన రద్దుకాగా ఆమె శ్రీసీతారామ చంద్రస్వామివారిని దర్శించుకుని, అన్నదాన సత్రంలో భోజనం చేసి వస్తోంది. అప్పటికే భారీ వర్షం కురవగా డ్రెయిన్లు వరద నీటితో ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. వాన కాస్త తెరపి ఇవ్వగా ఫోన్‌లో మాట్లాడుకుంటూ వస్తున్న ఆమె మురుగు కాల్వలో పడి కొట్టుకుపోయింది. అనంతరం పోలీసులు, ఎన్‌డీఆర్‌ఎఫ్ సిబ్బంది గాలింపు చేపట్టగా మృతదేహం లభించింది. ఆమెకు కుమారుడు, కుమార్తె ఉండగా ఇద్దరికీ వివాహాలు చేశారు. మృతదేహాన్ని న్యూగొల్లగూడెంలో ఇంటికి తీసుకురాగా, ఆ ప్రాంతంలో విషాదం నెలకొంది. వన్‌టౌన్ సీఐ కరుణాకర్, ఎస్సై విజయ, ఇతర సిబ్బంది మృతదేహాన్ని సందర్శించి సంతాపం తెలిపారు. కలివిడిగా ఉండే శ్రీదేవి మృతి చెందడంతో తోటి సిబ్బంది, స్థానికులు కంటనీరు పెట్టుకున్నారు. శ్రీదేవి భర్త రామారావుది నేలకొండపల్లి మండలం సుర్దేపల్లి కావడంతో ఆ గ్రామంలో కూడా విషాదం నెలకొంది. కాగా శ్రీదేవి మృతిపట్ల నిర్భయ ఆర్గనైజేషన్ ఫర్ ఉమెన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు, మహిళా న్యాయవాది మల్లెల ఉషారాణి ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు.

రూ.కోటి ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

భద్రాచలం: మంత్రి కేటీఆర్ పర్యటన బందోబస్తుకు భద్రాచలం వచ్చి ప్రమాదవశాత్తు మరణించిన హెడ్ కానిస్టేబుల్ శ్రీదేవి కుటుంబానికి ప్రభుత్వం రూ.కోటి ఎక్స్‌గ్రేషియా, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని డీసీసీ అధ్యక్షుడు, భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన శ్రీదేవి మరణించిన డ్రెయినేజీలు, స్లూయిస్‌ల ప్రాంతాన్ని పరిశీలించారు. రామాలయం చుట్టపక్కల స్లూయిస్‌లు, డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేదని అన్నారు. ఉద్యోగి మృతి బాధాకరమని, ప్రభుత్వ అలసత్వమే ఇందుకు కారణమని ఆరోపించారు. ఈ ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. భద్రాచలం అభివృద్ధికి హామీ ఇచ్చి అమలు చేయని కేసీఆర్, కేటీఆర్ పర్యటనకు వాతావరణంతో పాటు భద్రాద్రి రామయ్య సైతం సహకరించలేదని, ఇప్పటికైనా ఇచ్చిన హామీలు నెరవేర్చాలని సూచించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన మహిళ మృతి


శ్రీదేవి (ఫైల్)

చంద్రుగొండ / పెనుబల్లి: ఖమ్మం జిల్లా పెనుబల్లి మండలం గౌరారం టోల్‌ప్లాజా సమీపాన జాతీయ రహదారిపై సెప్టెంబర్ 28న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన రామిశెట్టి శ్రీదేవి (45) ఖమ్మంలో చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. చంద్రుగొండ మండలం తిప్పనపల్లికి చెందిన రామిశెట్టి శ్రీనివాసరావు – శ్రీదేవి దంపతుల కుమారుడికి బాబు జన్మించాడు. ఈ మేరకు మొక్కు తీర్చుకునేందుకు 28వ తేదీన లింగగూడెంలోని శివాలయానికి కారులో బయలుదేరారు. మొక్కు తీర్చుకున్న అనంతరం వస్తుండగా, గౌరారం టోల్‌ప్లాజా సమీపంలోని దేవతల గుట్ట వద్ద జాతీయ రహదారిపై ప్రమాదం జరిగింది. దీంతో కారులో ఉన్న శ్రీనివాసరావు – శ్రీదేవి దంపతులతో పాటు వీరి కోడలు లీలావతి, ఆమె తల్లి వేమూరి నిర్మల తీవ్రంగా గాయపడ్డారు. ఇందులో శ్రీదేవి శనివారం మృతి చెందగా, మిగిలిన ముగ్గురు చికిత్స పొందుతున్నారు. కాగా, కారు డ్రైవర్ జాన్‌పాషాతోపాటు బాలుడు ప్రమాదం నుంచి సురక్షితంగా బయటపడ్డారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి..


హత్తీరాం (ఫైల్)

టేకులపల్లి: విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. టేకులపల్లి ఎస్ఐ జి.రమణారెడ్డి కథనం ప్రకారం.. మండల పరిధిలోని రాంపురం పంచాయతీ పాతతండాకు చెందిన గుగులోత్ హత్తీరాం(47) శనివారం స్నానం చేసి టవల్‌ను దండెం(ఇనుప తీగ)పై ఆరవేశాడు. ఆ తీగకు విద్యుత్ సరఫరా అవుతుండటంతో షాక్‌కు గురై కింద పడ్డాడు. కుటుంబ సభ్యులు కొత్తగూడెం ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందాడని తెలిపారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య రాంపురం పంచాయతీ వార్డు సభ్యురాలిగా ఉన్నారు. ఎస్ఐ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పిడుగుపాటుతో వృద్ధుడి మృతి


పుల్లయ్య మృతదేహం

దుమ్ముగూడెం: దుమ్ముగూడెం మండలంలోని సింగవరం గ్రామ పంచాయతీ పరిధి వైట్ నాగారం గ్రామంలో పిడుగుపాటుతో పాయం పుల్లయ్య(60) మృతి చెందాడు. శనివారం ఉదయం ఆయన ఆవులను మేపేందుకు గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతానికి వెళ్లాడు. అక్కడ మధ్యాహ్నం వర్షం కురవడమే కాక పిడుగు పడగా, ఆయన మృతి చెందాడు. పిడుగుల శబ్దం విన్న స్థానికులు వెళ్లి చూసేసరికే పుల్లయ్య మృతి చెంది ఉన్నాడు. ఆయనకు భార్య, ముగ్గురు కుమారులు, ఓ కుమార్తె ఉండగా.. ఘటనా స్థలంలో ఆర్ఐ లక్ష్మయ్య పంచనామా నిర్వహించారు.